# "చప్రాసీ"

వేసవికాలం. వడగాడ్పులు కొడ్తున్నా లెక్క చెయ్యకుండా "మున్నా" బిత్తర చూపులు చూస్తూ గుడిశ తలుపును పడదోసుకుంటూ భూమి కడ్డంపడివచ్చి రైలు కట్టమీదెక్కి పట్టాల వెంబడి తొప్పుతూ నడుస్తున్నాడు.

ఆ పిల్లవాడు రోజూ వచ్చేరైలు పోయేరైలు గూడ్సుబళ్లూ వాటి రకరకాల కూతలు. బళ్ళలో తప్పకుండా పనిచేసే గార్డులూ — యింజను డ్రైవర్లూ కళాసీలు అందర్నీ గుర్తు పెట్టుకుంటున్నాడు.

మళ్ళీ ప్రతిరోజూ తను ఏమాత్రం పెద్దవాడయినదీ అంచనా వేసుకుంటూనే వున్నాడు.

ఏ చీర అంచుముక్కో, తాడో తెచ్చి, ఛాతీ కొల్చుకుంటున్నాడు. ఇంకా ఎంత పెద్దవాడయేవరకూ "మున్నా" నౌఖరీకి పనికిరాడో అ లెక్క యావత్తూ వాళ్ళ నెత్తీ నోరు మొత్తుకున్నా వాడికి తలకెక్కటంలేదు.

"మున్నా"కు ప్రాణసమానమైన ఒక గుడ్డల మూట వుంది. అందులో నీలంరంగు దళసరి కాన్వాసు పట్టీలు తీసి రోజుకు అధమం రెండు మూడు సార్లన్నా కాళ్ళకు చుట్టుకుని గుడిశెలో ప్రదక్షిణాలుచేసి తనలో తాను నవ్వుకుంటూ వుంటాడు. వాడికి రాయటమూ, చదవటమూ రానే రాదు. రాయగలగటం, చదవగలగటమనేది అందుబాటులో లేనివి. కాని ఆలోచించుకోవటానికి కలలు గనటానికి ఏ అంతస్తులు అడ్డురావు. "మున్నా" ఆలోచనలు చాలాకాలం వాడి రకరకాల చేష్టల్లో బయట పడుతున్నకొద్దీ వాళ్ళఅమ్మ కొంచెం అడ్డుపడుతూ, -- "ఇప్పుడుకాదు యింకా పెద్దవాడవు — యింకా బాగా, ఛాతీ బాగా పొడుగు ఎదిగాక అప్పుడు" అని నచ్చచెప్పేది.

"మున్నా"కు తను చప్పున చిటికెలో పెద్దవాడు కావాలనీ—అందుకు తల్లి ఎంతమాత్రం సహాయం చెయ్యకపోగా, ఏవో లేనిపోని సాకులుచెబ్తూ తన్ను పైవూరికి పోనివ్వటం లేదనీ లోపల కోపంగా వున్నమాట నిజం!" వీడి పోరు పడలేక చీకిపోయిన చెక్కపెట్టిలోంచి ఒక బట్టలమూట తీసి బైట పారేస్తూ అంది.

"ఒరే మున్నా! ఇవి మీ నాన్న నౌకరిలో వుండేప్పుడు వేసుకునే సర్కారువారిచ్చిన డ్యూటీ గుడ్డలు — నువ్వూ మీ నాన్నకుమల్లే "చప్రాసీ" కావాలని గెంతగానే సరికాదు. ఇదిగో చూడు!—యీ లాగూ కోటూ నీకు సరిపోవాలి. ఈ టోపీలో నీ బుర్ర దూరటానికింకా కాలం పడ్తుంది. ఈలోగా వెర్రిమొర్రి వేషాలు వెయ్యకు!"

"మున్నా" ఆ బట్టల మూటను సొంతం చేసుకున్నాడేగాని వాడి

ఆసక్తి ఎంతమాత్రం చావలేదు. ఆ తళతళలాడే డవాలీబెల్టు — కాళ్ళకు నీలిరంగు పట్టీలు, చారల తలపాగా, కాకికోటు, తెల్ల కళ్ళీ లాగూ తొడుక్కుని ఎప్పుడు దొరల గదిబయట పీటమీద కూర్చుంటానా, ఎప్పుడు చెవుల్లో "ట్రింగు"మని దొరల గంట మ్రోగగానే "జీహా" అని లోపలికి పరుగెట్టి దొరల ముందు నిలబడతానా, అప్పుడు ఎవరువీడు?—వోవో నువ్వు రామదీను కొడుకువుకదూ — మీ నాన్న చాలామంచివాడు నువ్వు కూడా జాగ్రత్తగా పనిచేసుకో — అని నవ్వుతూ తన్ను అంతా పలకరిస్తారా, అని "మున్నా" తహతహలాడిపోసాగాడు.

"మున్నా" నౌఖరీగురించి ఎప్పుడు కలలు గనటం మొదలెట్టాడో వూహించటం కష్టం. కాని ప్రాయం తెలిసినప్పట్నుంచీ వాడు వాళ్ళ అమ్మను ప్రశ్నలతో వేధించుకు తినటం మొదలెట్టాడు. వర్షాకాలం ఎడతెరిపి లేకుండా కుండపోతగా ఆకాశంమీంచి నీళ్లు దిమ్మరించేస్తున్నప్పుడును, పెద్దరాక్షసి గాలివీచి గుడిశ కూకటి వేళ్ళతో గబగబా కదలాడిపోతున్నప్పుడును దిక్కు తెలియనంతా భయంతో తల్లి, వొడిలో "మున్నా" తలదాచుకున్నప్పుడు ఆ కన్నీళ్ళతో తల్లి వెళ్ళబోసుకునే దుఃఖమయ గాథలు స్పష్టాస్పష్టంగా "మున్నా" వింటూ వచ్చాడు.

రైలుబద్దీల్ను చూపించి పశ్చిమంగాపోతే పెద్దగ్రామం తగుల్తుందనీ — అక్కడ రైల్వే ఆఫీసులు, బాబులు, పెద్దపెద్ద దొరలువుంటారనీ అల్లాటిచోట గాలికి వానకీ జడవనవసరం లేకుండా గట్టి రాతియిళ్లు కట్టారనీ అందులో వొకప్పుడు "మున్నా — తల్లీతండ్రీ" జీవించేవారనీ కూడా వాడికి తెలుసు. చప్రాసీ "రామదీను" పేరంటే అక్కడ అందరికీ చాలా యిష్టమనీ — నీళ్ళు గొట్టాల్లోంచి వస్తాయని, బళ్ళు మనుష్యులలో అటూ ఇటూ పరిగెడ్తాయని, "మున్నా" తల్లి ఆరోజుల్లో యిప్పట్లా చలీ, వానా ఎండా అన్న భేదంలేకుండా కూటికోసం అంట్లూ—చెంబులూ—

తప్పేలాలూ తోమేది కాదని వాడికితెలుసు. ఎప్పుడూ కట్టుకోవటానికీ మరో బట్ట యింట్లో గోధుమపిండి పంచదార చాపొడుంకూడా వుండేవి. చప్రాసీ "రామదీను" శలవుల్లో మున్నా తల్లిని కాశీ తీసుకెళ్ళి గంగా పానీలో స్నానాలు విశ్వేశ్వరుడుకి పూజలు కూడాచేయించి తీసుకొచ్చాడు.

ఈ స్వర్గం ఎప్పుడు ఎల్లా కూలిపోయిందీ "రామదీను" భార్య చిలవలూ పలవలూ తీర్చి మధ్యమధ్య కళ్ళనీళ్ళు వత్తుగుంటూ చెప్పేది. "రామదీను" భార్య యీ విషయం ఎన్నిమార్లు ఎందరికి చెప్పిందో లెక్కలేదు కాని—ఆ స్వర్గాన్ని వర్ణించడంలో, ఆమెకున్న ఆశక్తి ఆ దుఃఖాన్ని త్రవ్వుకోటంలో ఆమెపొందే వుపశమనం "మున్నా"కు వక్కడికే తెలుసు. ఆ మాటల్ని వినడం వాడికి అలవాటే అయినా అందులో ఎంత మాత్రం విసుగు పుట్టించేదికాదు.

తను పెద్దవాడయి తండ్రి రామదీనులా "చప్రాసీ" పనిచేసి కోల్పోయిన మహాసామ్రాజ్యాన్ని కైవసం చేసుకుని తల్లిని సుఖపెట్టాలనే నిర్ణయంకూడా వాడుమనస్సులో అజ్ఞాతంగా గూడు కట్టుకొని పోయింది.

అప్పుడు మున్నా తల్లి భజనకీర్తనలు పాడుకుంటూ వాన—గాలి భయంలేనటువంటి రాతియింట్లో వుంటుంది. గోధుమపిండి విస్తారం యింట్లో వుండొచ్చు "చా" పానీకూడా తడుముకోనవసరంతుండా వుండి తీరుతుంది. అప్పుడు యీ ఇల్లు ఎవరిదంటే — చప్రాసీ రామదీను కొడుకుది— ఎరగవూ "మున్నా" అంటారు. వాడే? అని అంతా చెప్పుకుంటారు.

ఈ బలమైన నిర్ణయాలు వేళ్ళుపాతుకొని "మున్నా"లో వ్యాపించి వుండటం వలన వాడు వాళ్ళ అమ్మతో అంట్లుపని గిన్నెలు తోమడం కడగటం లాటి వ్యాపారాల జోలికి పోయేవాడు కాదు. గోళీకాయలు, బిళ్లాకర్రా, బచ్చాలు ఆడ్డంఅంటే చాలా యిష్టం. తతిమ్మా కాలం యీపత్తూ రైలుకట్ట వెంబడినపడి చాలదూరం వరకూ తిరిగి తిరిగి వచ్చే

పోయే బళ్ళు వాటి కూతలు మనుషుల్ని గుర్తుపెట్టుకోవడంలో సరి పోయేది.

— కాని యింట్లో మున్నా తల్లి రెక్కలు ముక్కలు చేసుకొని నీళ్ళుమోసి అంట్లుతోమి పూటగడవడం కోసం నిర్విరామంగా కష్టపడి చాకిరీచేసి రోజుల్ని వెళ్ళబుచ్చేది.

తమకోసం తాము కష్టపడటంలోకన్నా యితరుల కోసం బాధల్ని సహిస్తూ కష్టాల్ని సంతోషంగా స్వీకరించడంలో మానవులు దేవతల్ని అధిగమిస్తున్నారు. ఆమె "మున్నా" కోసం కష్టపడటానికి వెనుదీయ లేదు. తల్లి తమతమ బిడ్డల మంచి చెడ్డలకోసం తాపత్రయ పడ్డం అస హజమూ ఆశ్చర్యజనకమూ కాదగిన దేదీకాదు.

"రామదీను" బడా ఆఫీసులో చప్రాసీగా వుండేవాడు. అతడిది బలిష్టమైన కాయం. నమ్మకమైన జీవనం సాగించాడు. చాలా కష్టంమీద సంతకం పెట్టడం వరకూ నేర్చుకున్నాడు. బంగళాల్లో పనిచేశాడు. దొరల జీవనమంతా చూచాడు, తన పూర్వికులు వ్యవసాయం చేశారు. ఫలసాయం మీద జీవనం చేసేవారు. నౌఖరిలో కాయకష్టం అలవాటు తప్పిపోయాక నెల జీతం మీద బ్రతకటం ఎంతో సుఖంగా వుండేది. చాలా కాలం "రామదీను"కు పిల్లలులేరు. నలభయ్యోయేట మున్నా వెలిసాడు. మున్నా తల్లి కళ్ళల్లో వొత్తులేసుకుని పెంచుతుంది. రామదీను తనకొడుకు చప్రాసీ కావాలని అంటూండేవాడు. రామదీను ధారంకూడా స్థిరమైన జీవనంమీద ఏర్పడ్డ గురికుల వృత్తిమీద నిరాదరణగా మారిపోవడంలో అసహజమేమీ లేదు.

ఆ రోజులలో పాటకజనం శ్రామికుల్లో యీ మార్పు ప్రబల మయింది. ప్రజలు చేతుల్లోని పనిముట్లును విసిరివేయవలసి వచ్చింది. వృత్తుల్ని సాధ్యమైనంతవరకూ త్యజించారు.

గ్రామాల్లో వృత్తులు పనిపాటలు చేసుకునేవారు పట్నాలకు పలాయనం చిత్తగించారు. స్వయం సమృద్ధిగావుండే గ్రామాలు క్రమంగా పట్నాలమీద ఆధారపడ్డం తప్పనిసరైంది. నాగరికతయొక్క వ్యాప్తి స్వయం పోషకతను బలిచేసుకుని ఎన్నో కుటుంబాలనుచిన్నాభిన్నం చేసేసి దేశాన్ని బలహీనపర్చటం జరిగింది. ప్రజలుతమ శక్తి సామర్థ్యాల మీద నమ్మకాన్ని పోగొట్టుకున్నారు అందుచేత "రామదీను" చారెడు చెక్క కూడ ఫలసాయం చేసుకోకుండా నౌఖరీలో తనువు వెళ్ళబుచ్చి ఆ మార్గాన్నే తన "మున్నా"కు కూడా అభిలషించి చూపించి వున్నాడు.

కాలం తిన్నగా ఎప్పుడూ గడవదు. "రామదీను" రైల్వేలో చప్రాసీగా వుంటూ త్రాగటం, జూదం మరిగాడు. స్నేహితులు బలిశారు. కుటుంబం కోసం మున్నా భవిష్యత్తుకోసం జాగ్రత్త పడ్డానికి మారుగా వేదాంతం మరిగాడు. భంగు తయారు చేయించాడు. పెద్ద పెద్ద భజనలు జరిపించి భక్తులతో కలిసిపోయాడు. మున్నా తల్లి అమాయకురాలు. పశువుల్ని మేపుకొని పాలు పెరుగూ పిడకల్ని చేసుకుంటూ "రామదీను" సంపాదనకు చేదోడు వాదోడుగా నాలుగు రాళ్ళను జమచేసి యిస్తూండేది. కాని — దురదృష్టవశాత్తు "రామదీను"కు క్షయవ్యాధి సంప్రాప్తించింది: అది చేతబడిఅనీ. గాలియనీ రకరకాలుగా నాటువైద్యం, భూత వైద్యం చేయించాడు. తరువాత రోగం ముదిరి నెత్తురు కక్కుకుంటూ తీసుకుని తీసుకుని చప్రాసీ "రామదీను" మహా భక్తుడు పరమపదించాడు, రామదీను చనిపోయే సమయానికే మున్నా తల్లి పశువుల్ని ఇంట్లో విలువైన సామాగ్రిని అమ్మేసి ఇంటి ఖర్చుల్ని భరాయించవలసి వచ్చింది. చప్రాసీ రామదీను చనిపోయిన మర్నాడే పసికుంక మున్నాను తీసుకుని కన్నీళ్ళతో ఆ రైల్వే జీవితానికి మున్నా తల్లి వీడ్కోలు పలకవలసి వచ్చింది.

ఈ రైల్వే ఆఫీసులున్న గ్రామానికి సుదూరాన చప్రాసీ రామదీను

మిత్రులంతా చేరి ఒకచిన్న గుడిశనువేసి "మున్నా" తల్లికి నిలువ నీడను ఏర్పాటు చేసి యిచ్చారు. ఆ తర్వాత మున్నా — ఏమైందీ వాళ్లు ఎలా జీవిస్తున్నదీ ఎవరూ కనుక్కోలేదు. ఆ అభాగ్యురాలు తన దుఃఖ మయ గాథను పరిచితులకు వెళ్ళబోసుకున్నప్పుడు క్రొత్తలో సానుభూతితో విన్నవారువిన్నారు. తరువాత యిదంతా పిచ్చిసోదక్రిందకట్టేసి విసుక్కో వటం ఆరంభించారు.

ఎవరు విసుక్కున్నా ఎంతమంది పిచ్చిసోదక్రిందకట్టినా "మున్నా" తల్లి గాథనంతా శ్రద్ధతో ఉత్సాహంతో విన్నాడు.

వాడికి ఎంతో కోపం వచ్చింది. ఈ అక్కసునంతా ఎల్లా ఎవరి మీద వెళ్ళబుచ్చుకోవాలో వాడికి స్పష్టంగా తెలియటంలేదు. వాడి ఛాదీకేసి చూసుకుంటున్నాడు. తండ్రినుంచి సంప్రాప్తించిన దుస్తుల మూటను చంకన బెట్టుకున్నాడు. తల్లి పనిలోకి వెళ్ళింది—రాదు, రైలుకట్టను పుచ్చుకొని పశ్చిమంగా ఎండలో మిటమిటలాడేవేళ పెద్దపెద్ద అంగల్ని వేసుకుంటూ వాడి మహాలక్ష్యాన్ని మననం చేసుకుంటూ ముందుకు పోతు న్నాడు. "మున్నా"కు నిండా పన్నెండేండ్లులేవు. అరికాళ్ళు భగ్గున మండి పోతున్నాయి. గాలి జోరుగా నిప్పుల్ని చెరుగుతున్నట్లుంది. నిల్చుందా మున్నా కనుచూపుమేరలో ఎక్కడా చెట్టూ—చేమా కనపడ్డంలేదు. నోరు దప్పిపడిపోయి ఆర్చుకుపోతున్నది. ఇంట్లో రొట్టెలు తిని బయలుదేర వలసింది. "మున్నా" తల్లితో జగడమాడాడు. ఇంట్లో తిని కూర్చుంటే తను ఎంతోకాలం చేతుల్ని ఏరుచుకోలేనని తల్లి విసుక్కుంది. "మున్నా" స్పష్టంగా చెప్పాడు — పట్నంవెళ్ళి నౌఖరీ అడిగివస్తానని, తల్లి చీత్కా రం చేసింది. నౌఖరీ అడగటానికి వయస్సు చాలదు. పోవద్దని మున్నా తల్లి నచ్చచెప్పింది. బస్తీకి వెళ్ళి యే జాలిగుండెగల తండ్రికన్నా తన సొద చెప్పుకుంటే మనస్సుకరిగి పిల్లవాడ్ని దగ్గిర అట్టెబెట్టుకొని తిండి

పెట్టి బట్టయిస్తే — యింటిపనికి కుదుర్చుకుంటే — ఆ మహారాజులే ఉద్యోగం వేయించి పెడ్తారని "మున్నా" అనుకున్నాడు. చప్రాసీ రామధీను కొడుకునుకానా — తండ్రి పేరు చెబితే సర్కారువారే వేయిస్తారు నౌఖరీ అని.

"మున్నా" బస్తీ చేరుకునేసరికి ముచ్చెమటలుపోసి దేహం నీళ్లు కారిపోతోంది. లోపల ఆకలి కార్చిచ్చులా రేగింది. మంచినీళ్లు త్రాగుదామన్నా ఎక్కడా నీరుకూడా పుట్టేట్టులేదు. జనం పల్చపల్చగా తిరుగుతున్నారు. సంతబజారులో పాకల్లో పశువులు విశ్రాంతి తీసుకుంటున్నాయి. దుకాణాలు యావత్తూ సగం తెరిచీ సగం మూసి మాగన్ను మీదున్న బాటసారి నేత్రాల్లాగున్నాయి. అక్కడక్కడ దారుల్లో నీడలున్నచోట అవ్వలు బఠాణీలు మరమరాలు తట్టల్ను పర్చుకుని కూర్చున్నారు. "మున్నా"కు నోరూరింది. కాని దగ్గర కాణీపైసా అన్నాలేదు. కిల్లీ దుకాణాలవద్ద మాత్రం ఎవరో వొకరు ఆగి పానువేసుకుని బీడీలు సిగరెట్లు కొనుక్కొని వేగిరం వెళ్ళిపోతున్నారు. "టీ" దుకాణం దగ్గర "మున్నా ఆగి నిలబడి లోపలికి సంకోచంగా చూస్తూండిపోయాడు. ఎవరో టీ, బాగులేదనుకొని జగడమాడి విస్సురుగా కప్పులోని చానీళ్ళను వీధిలోకి విసరటంలో మున్నా మీదపడి వొళ్లు చురికి మొయ్యోమని గోలపెట్టసాగాడు. ఎవరో పనివాళ్ళువచ్చి కుర్రవాడ్ని సముదాయించి లోపలికి తీసుకెళ్ళి వొళ్ళు కడుక్కోవడానికి నీళ్ళిచ్చి ఎవరునువ్వని అడిగారు "మున్నా" ఏడుస్తూ చప్రాసీ 'రామదీను' కొడుకునని చెప్పాడు. ఎక్కడవుంటావు, ఎందుకు వచ్చావు అని అడిగితే "నౌఖరీ" కోసమని చెప్పి తను తెచ్చిన గుడ్డలమూటను విప్పి చూపించాడు. అంతా పగలబడి నవ్వారు. "మున్నా" అందమైన కుర్రాడు. బొద్దుగా పచ్చగా జులపాలు తిరిగిన జుట్టుతో శుభ్రమైన కుర్రాడు దొరకగానే హోటలు ముతా "చా" యిచ్చి కబుర్లలోపెట్టి పనియిస్తాం చేస్తావా అని అడిగారు. ఏంపని? గిన్నెలు తోమడం చెంబాలు

గ్లాసుల్ని కడగటం ఎంగిళ్ళు ఎత్తటం అన్నీనూ—సబ్బుముక్క, నెలకు రెండుమార్లు క్షవరం, ఏడాదికి రెండు జతల గుడ్డలుయిచ్చి తిండిపెట్టి పదీ రూపాయలు యిస్తాం అన్నారు. "రామదీను" కొడుకు చప్రాసీ పని చేస్తాడుకాని గిన్నెలుమాత్రం కడగనని ఖచ్చితంగా చెప్పాడు.

"మున్నా" వాళ్ళను వదలి రైల్వే ఆఫీసులున్న పరిసరాలకు చేరుకునే సరికి అపరాహ్ణమైంది "చప్రాసీ" పని చేయటం వాడి జీవితాదర్శం మరొహటిది ఏదీ వాడి కంటికి ఆనదు. హోటల్లో పనివాడుగా చేరటం ఎందుకు నామోషీ అనిపించిందో చెప్పటం కష్టం. కాని వాడి మనసులో గూడు కట్టుకున్న నిశ్చితంపేరు, తన తల్లిని పనిపాట్లనుండి తప్పించి గుడిశ ఖాళీ చేయించి కుదురుగా జీవించే యేర్పాట్లు సమకూర్చే వరకూ "మున్నా" నిద్రపోడు. ఆఫీసులు ఒంటరిగా ఒకే మైదానంలో గుబురుగా పెరిగిన నీలగిరిచెట్లు ప్రత్యేకంగా అమర్చినట్లున్న పూల మొక్కల మధ్య చక్కగా యేర్పాటుగా కట్టబడివున్నాయి. పెద్దపెద్ద గోడలు, అద్దాల కిటికీలు లోపల దీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. పంఖాలుగిర్రున తిరుగుతూంటే కాకీదుస్తుల్లోవున్న చప్రాసీలు అటూ ఇటూ ఆదుర్దాగా పచార్లు చేస్తున్నారు.

"మున్నా" పస్తాయించి చూశాడు. ఈ ఆఫీసుల్లో తిరగటానికీ కాకీ దుస్తుల్ని వేసుకునే అదృష్టానికి వారసత్వం తనకూ వుంది. "నౌఖరీ" అడగటమే ఆలస్యం. తనదికాని "రామదీను" కొడుకునని చెప్పగానే తన్ను చిరునవ్వుతో పలకరించి బాబులు ఆదరిస్తారు. ఇట్లా ఆలోచించుకుంటూ ఆఫీసు గడపల్ని చేరుకునేసరికి అక్కడ ఎవరో చప్రాసీలు కూర్చుని కబుర్లు కడ్తున్నారు. అవును — ఈ పని చప్రాసీ "రామదీను" కొడుక్కికూడా చేతనవును. ఈ సుందరమైన భవనంలో తనతండ్రి కవర్లు

కడుతూ, కాగితాలు మోస్తూ ఏళ్ళతరబడి విశ్వాసంగా పనిచేసివుంటాడు. అల్లాంటప్పుడు ఆ హక్కు తనకు ఎల్లానూ వుంటుంది.

చప్రాసీలు ఈ క్రొత్త కుర్రాణ్ని పలకరించారు

చప్రాసీ "రామదీను" కొడుకునని వాడు గర్వంగా చెప్పాడు. "నౌఖరీ" కోసం వచ్చాననీ వాళ్ళతండ్రి జాగాతనకు యిమ్మని అడుగు తాననీ వాడు నదురూ బెదురూ లేకుండా చెప్పాడు. చంకలోని మూటని వాళ్ళంతా విప్పి చూచారు. నిజంగా అందులో చప్రాసీ టోపి, బెల్టు కాకి కోటు, కాళ్ళకు చుట్టుకునే నీలిరంగు పట్టీలు వున్నాయి. కుర్రవాడు చక్కగా స్ఫురద్రూపిలాగున్నాడు. వాళ్ళలో వాళ్ళు యేమి గుసగుసలాడు కున్నారోగాని నవ్వుకుంటూ "మున్నా"కు వ్రేలితో దొరగది వైపుచూపించి అక్కడకు యీ మూట పట్టుకొనివెళ్ళి అడిగితే నీ పని చక్కబడుతుంది అని అంతా చెప్పారు.

అంతా బాగానేవుంది "మున్నా"కు లోపల సందేహమేమిలేదు. సర్కారువారు తన తండ్రి మంచితనానికి అణకువ విధేయతకు ప్రతిఫ లంగా తన్ను ఆదరించి సత్కరిస్తారనే ఆశ వాడికేమో ఎల్లానూవుంది. ఇంత సుందరమైన ఆవాసంలో యింతమంది బ్రతక గలుగుతున్నారు. ఎంతెంత మంచివాళ్లుంటారో, వీళ్ళంతా తమబోటి దురదృష్టవంతులకు యెంతలేసి మంచిమంచి వుపకారాలుచేస్తారో చెప్పటం కష్టం!—చేస్తే "నౌఖరీ" యిక్కడేన్నె చెయ్యాలి

"మున్నా" మూటను చంకనిరికించుకుని చప్రాసీలు వ్రేలితో చూపినవైపు వరండాగుండా నడిచి ద్వారంవద్దనున్న రెక్కతలుపును త్రోసుకుని గదిలోకి వెళ్ళి నిలబడ్డాడు.

"మున్నా" కళ్లు జిగేలుమన్నాయి. దీపం దేదీప్యమానంగా వెలుగు తోంది. ఆకుపచ్చరంగు నూనెకాగితం బల్లమీద అమర్చివుంది. తెలి

ఘోషలో ఏదో ప్రసంగం చేస్తున్న మిసమిసలాడిపోయే దేహకాంతిలో చక్కని వున్నిసూటులో నిలబడ్డదొర అకస్మాత్తుగా కొయ్యబారిపోయి నట్లయి ఫోనును విసిరికొట్టి బిగ్గరిగా కేకలు పెట్టనారంభించాడు.

"మున్నా" నిలబడి నోటమాట లేకుండా చూస్తున్నాడు. దొరకు చెవికీ నోటికీ తగిలించుకున్న గొట్టంలోంచి ఏదో తప్పకుండా అంట బొడిచి వుంటుంది. పాపం గగ్గోలు పడిపోతున్నాడు.

దొరచేతివద్దనున్న గంటను గణ గణా మ్రోగించాడు.

రివ్వున పారివచ్చారు ఇద్దరు చప్రాసీలు.

ఆ తర్వాత ఏం జరిగిందో "మున్నా"కు స్పష్టంగా జ్ఞాపకంలేదు. ఆ చప్రాసీలిద్దరూ చెరోరెక్కా పుచ్చుకుని బరబరా నేలమీద యీడ్చు కుంటూనే "మున్నా"ను రోడ్డుమీదకు లాక్కువచ్చి పడేసి చెరో నాలుగు తన్నులు తన్నారు. తాను చప్రాసీ రామదీను కొడుకుననీ, నౌఖరీ కోసం వచ్చాననీ నెత్తీనోరు మొత్తుకున్నా ఎవరూ వినిపించు కోలేదు.

"మున్నా" మున్నాతల్లి "రామదీను" ప్రేతాత్మ కలసి కట్టుకున్న ఆకాశ హర్మ్యం వొక్కసారి మూల మట్టంగా కూలి నాశనమయింది.

"మున్నా" రోడ్డుమీదనుంచి లేచి డొక్కుపోయిన ముఖం నెత్తురు కారుతున్న బుజాలు వీపు మోకాటి చిప్పల్తో బజారువైపే నడకసాగిం చాడు. ఓ మూల ఆకలి మరో వైపు అవమానం అన్నింటినీమించి క్రోధం వాడిలో పెనవేసుకున్నాయి,

ఆ కోపం ఇప్పుడున్న ఆఫీసులమీద కాదు. చప్రాసి నౌఖరీ చేసిన తన తండ్రిమీద — చప్రాసీ నౌఖరీపై మోజుకలిగించిన తన తల్లిమీద ఈ తప్పంతా తన వంశానిది—తన పెద్దలది. "మున్నా" పడుతూలేస్తూ సాయంత్రం బజారునిండా మనుష్యులు కలకలలాడే వేళ తూము గట్టు

పద్దకుచేరి ఆలోచిస్తూ నిలబడ్డాడు. తలనిండా బొప్పికట్టింది, గడ్డం చితికి నెత్తురు గడ్డకట్టింది. వాడికి హఠాత్తుగా జ్ఞానోదయమయింది.

ఒక సాయిబు కుర్రవాడు గళ్ళలుంగీ వేసుకుని ఫ్లూటువాయిస్తూ వస్తున్నాడు. వాడి వెనకాతల చాలమంది పిల్లలుచేరి గుంపులు గుంపులుగా సంతోషంతో వెంబడిస్తున్నారు. ఆ సాయిబు బుజాన ఒక పెద్ద కర్రవుంది. దాని నిండా చిల్లులకు పుడకలు తగిలించి వున్నాయి. ఆ పుడకలకు రంగు కాగితాలతో చక్రాలు గిర్రున మనోహరంగా తిరుగుతున్నాయి. యింకా వాడి వీపున సంచీ నిండా బూరలూ, యీలలూ ఎన్నో వున్నాయి. రబ్బరు బెలూన్లు వూది పిల్లలకు అమ్ముతున్నాడు.

"మున్నా" వాడి వెంటబడ్డాడు.

"రామదీను" భార్య —— గుడిశలోకి వచ్చి చూసింది రొట్టి, నీళ్లు ఎక్కడ పెట్టినవి అక్కడే వున్నాయి.

"మున్నా — మున్నా" అని ఎలుగెత్తి కేకలు పెట్టింది. అపరాహమైంది. జాడలేదు. ఏడ్చింది, నలుగురితో పోయిమొత్తుకుంది, బస్తీనుంచి వచ్చినవారు "చూశామన్నారు" "రామదీను" భార్య యేడుస్తూబస్తీ అంతా తిరిగి "మున్నా"ను పట్టుకుంది.

"మున్నా" సాయిబు యింటిదగ్గర రంగు కాగితాల్తో చిలకల్ని కత్తిరించి అంటిస్తున్నాడు. వాడి ముఖానికి గడ్డానికి గల గాయాలకు పట్టీలు వేసివున్నాయి. "ఇదేమిటి నా తండ్రీ" అని మున్నాతల్లి వలవల లాడింది. "మున్నా" బట్టలమూటను తెచ్చియిస్తూ "యిదిపట్టుకుపొమ్మ"ని ఖచ్చితంగా చెప్పేశాడు. "ఇదేమిటిది నీకు ప్రాణంతో సమానంగదా— నా "మున్నా" నా తండ్రీ; యింటికిరావూ?" అని బ్రతిమాలింది,

"మున్నా" ఠీవిగా నిలబడ్డాడు.

"అమ్మా నేను చప్రాసీ "రామదీను" కొడుకునుగాను, చూశావా? ఈ చేత్తో కత్తి పట్టుకుని రంగు కాగితాల్ని కత్తిరించానంటే, బుడగల్ని వూది అమ్ముకుంటూ తిరిగానంటే రోజుకు దోసెడు డబ్బుల్ని తెచ్చి నీ వొళ్ళొపోస్తాను. చప్రాసీపని నాకక్కర్లేదు.

మున్నా తల్లికి ఆమాటలు అర్థంకాలేదు. సాయిబు చిరునవ్వుతో మున్నా తల్లిని పరామర్శించాడు. స్వచ్ఛందవృత్తి మీద వచ్చేకూడు నాకు కావాలి. బానిసబ్రతుకు నాకక్కర్లేదని మున్నా స్పష్టంచేశాడు.

తరువాత బుడగల్తో —బూరలను రకరకాలుగా పరికిస్తో, వెంట గుంపులు గుంపులుగా పిల్లలు ఆడుతూ పాడుతూ వెంబడించగా "మున్నా" బజారులో ప్రతివీధిలోనూ ప్రతీగుమ్మం ముంగిటా నిలబడి ఫ్లూటు వాయించడం చాల మందికి తెలుసు. ఆ గాన మాధుర్యాన్నిచూసి మోసపడి ఆబూరాలు కొన్నపిల్లలకు ఆ వాద్యం అంతసులువుగా పట్టుబడినప్పటికీ, అందులోని ఆంతర్యం ఆ స్వాతంత్ర్య పిపాస—స్వచ్ఛంద వృత్తి మీదుండే ఆకాంక్ష ఎవ్వరూ పోల్చుకోలేదు.

"మున్నా" తల్లిమాత్రం దొడ్లో పండించిన మిరపకాయలు, తోటకూర, కరివేపాకు గంపల్లో నింపుకుని యింటింటిముంగిటా ఆగి వాడికలు యిచ్చిచెమటతో తడిసిన కానుల్ని లెక్క చూచుకుంటూ వుంటుంది.

రాత్రిళ్లుమాత్రం "మున్నా" డోలకు నొకదానివి మెడకు చుట్టుకుంటాడు. కుక్కిమంచంమీద తల్లి కూర్చుని చీకినబట్టలకు చిరిగిన దుస్తులకు గ్రుడ్డిదీపం వెలుగులో మాసికల్ని కుట్టుతూండగా—శ్రావ్యంగా డోలకుదరువులు పడ్తూండగా

"ఛోటిసి ఝోపిడియామేఁ
రామ్ ఆయేంగే తేరేశ్యామ్ ఆయేంగేఁ
ఘనశ్యామ్ ఆయేంగేఁ"

అని మనోహరంగా పాడుతూ నృత్యంచేస్తూంటాడు.

అప్పుడు వీచేవాయువులు కూడా ఆ స్వచ్ఛంద గీతికలకు— ఢోలకుదరువులకు తలలూస్తున్నట్లుగా వుంటాయి. చెట్ల ఆకుల సైతం గల గలా ఆనందతో చప్పుడ్లు చేస్తాయి.